# 'నది తోసుకుపోయిన నావ'

-కొత్తపల్లి ఉదయబాబు

"సార్! మమ్మీ మిమ్మల్ని ఒకసారి వీలయితే ఇంటికి తీసుకురమ్మన్నారు వస్తారా?" అడిగింది ప్రజ్ఞ ఇంటర్వెల్‌లో నా దగ్గరకు వచ్చి.

ప్రజ్ఞ విషయంలో నావల్ల ఏమైనా పొరపాటు జరిగిందేమోనని ఒక్క క్షణం కంగారు పడ్డాను. ఒక్క సారి క్రితంరోజు నా కార్యక్రమాన్ని గుర్తుచేసుకున్నాను. లేదు, నా వల్ల పొరపాటు జరగలేదు అని నిర్ణయించు కున్నాను.

"సరేనమ్మా! వస్తాను" అన్నాను.

అన్నానేగాని నా మనసులో ఎందుకు? అనే ప్రశ్న అంకుశంలా పొడవబోయేటంతలో ప్రజ్ఞ తన రూమ్ వైపు వెళ్ళబోయేదల్లా ఆగి "అన్నట్టు సార్! మీరు మా యింటికి రావడానికి ప్రిన్సిపాల్ పర్మిషన్ తీసుకుని వస్తారేమో! ఆ అవసరం లేదని చెప్పమన్నారు మమ్మీ!" అంది.

"సరే! మరి మీ యిల్లు నాకు తెలీదే?" అన్నాను.

"సాయంత్రం స్కూల్ అయాక నేను, మీరు కలిసి వెళ్దాం సార్. నేను రిక్షాలో బుక్స్ బేగ్ పంపేసి మీతో వస్తాను. థాంక్యూ సార్!" అనేసి ప్రజ్ఞ వెళ్ళిపోయింది.

పట్టణంలో అత్యంత ఖరీదైన లొకాలిటీలో ఏర్పాటు చేసిన "అవర్ ఫ్యూచర్ ఇండియన్స్" కాన్వెంట్‌లో నేన మేథ్స్ టీచర్‌గా చేరి నెల రోజులు కావస్తోంది. ఈ నెల రోజులలో కష్టపడి విద్యార్థి స్థాయికి దిగి పాఠం అర్థం అయ్యేలా చెప్పే మాష్టారుగా పేరు సంపాదించుకున్నాను.

పేరెంట్స్ డైరెక్టుగా ఆ కామెంట్ నాకు వ్రాసి పంపించారు.

ఉపాధ్యాయుడిగా సంతృప్తిగా జీవితం ప్రారంభిం చిన నాకు "యిదేమిటో యీ కబురు?" అని అసం తృప్తిగా అనిపించింది.

ప్రజ్ఞ తొమ్మిదవ తరగతి చదువుతోంది.

చదువు చాలామంది చదువుతారు. కాని విద్య విజ్ఞానం కోసం అన్నట్టు చదివే వారిని వేళ్ళమీద లెక్క బెట్టవచ్చు.

ప్రజ్ఞ రెండో కోవకు చెందుతుంది.

నేర్చుకున్న ప్రతీ చిన్న విషయాన్ని 'మూలం' నుంచీ తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది ఆమె. అందుకోసం నిత్యం స్కూల్ లైబ్రరీలో ఏదో ఒక పుస్తకం ఏదో ఒక అంశం మీద రిఫర్ చేస్తూనే ఉంటుంది.

అర్థం తెలియకపోతే నా దగ్గరకు తీసుకువచ్చి చెప్పించుకుంటూ ఉంటుంది.

"ఇంత చిన్న వయసులో ఎందుకమ్మా అంత తాపత్రయం?" అన్నాను కుతూహలం అణుచుకోలేక.

"నాకు అవగాహన అయితేనే కదా సార్ మరొకరికి చెప్పగలిగే స్థానంలో నిలబడగలిగేది!" అంది.

ఆమె ఎవరికి చెప్పగలిగే స్థాయిలో ఉండాలని అనుకుందో ఆమెతో ఆ సాయంత్రం వారింటికి వెళ్ళాక అర్థం అయింది.

❖ ❖ ❖

"మమ్మీ! మా సార్!" అంటూ ఎంతో వినయ పూర్వకమైన ప్రవర్తనతో యింటికి ఆహ్వానించి అతిథి మర్యాదలు అన్నీ అందించాక, నాతో మాట్లాడటానికి వచ్చిన తన అమ్మగారికి పరిచయం చేసింది ప్రజ్ఞ.

"నమస్తే మేడమ్!" అన్నాను చేతులు జోడించి.

"నమస్తే. మీకు అక్కయ్య లాంటి దాన్ని. నన్ను మేడమ్ అని సంబోధించడం బాగాలేదు. మీరు మా పాప చదువుతున్న కాన్వెంట్లో ఉపాధ్యాయుడిగా చేరడం మా అదృష్టం. ఈ రోజుల్లో ఒక సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా రిటైర్ అయిపోతున్నారు. ఇక ప్రైవేటు కాన్వెంట్లలో బ్రతకడం కోసం పనిచేసే ఉపాధ్యాయులే తప్ప వృత్తికి న్యాయం చేసే ఉపాధ్యాయుల్ని వేళ్ళతో లెక్కపెట్టవచ్చు. బోధించడమే పరమార్థంగా పెట్టు కుంటున్నారే తప్ప అది విద్యార్థికి ఎంత స్థాయి వరకు చేరిందీ అన్నది గమనించే స్థితిలో వారు లేరు.

ఒకవేళ అటువంటి ఉపాధ్యాయులు ఉన్నా తమ పిల్లలకు ర్యాంకు ఎందుకు తగ్గింది? అంత డబ్బు కట్టించుకుని మీరేం చేస్తున్నారు? మీ ఉపాధ్యాయులను ఏం పర్యవేక్షిస్తున్నారు? లాంటి ప్రశ్నలు విద్యావంతు లైన తల్లిదండ్రుల దగ్గర్నుంచి ఎదురవుతూ ఉండడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు రావలసిన దానికన్నా ఎక్కువ మార్కులు వేసి ఆ 'బెడద' నుంచి తప్పించు

కుంటున్నారు.

నేను మీరు వేల్యూ చేసిన చాలా పేపర్లు పరిశీలించాను.

తర్కంతో లెక్కలు చేయడం నేర్పే మీ విధానం వల్ల విద్యార్థులకు సబ్జెక్టు పట్ల భయం పోతుంది. మీరు రాని క్రితం లెక్కల్లో తనకు సిక్స్టీ పర్సంట్ దాటేది కాదు. ఈవేల ఎంతగా మార్పు వచ్చిందంటే దాని ప్రతీ ఆలోచనలోనూ తర్కం ఉండేటంతగా మీరు దాన్ని మలచగలిగారు. అదలాగే కొనసాగించండి దయచేసి.

ఇక మిమ్మల్ని యింటికి పిలిపించిన విషయం.

ఒకసారి లోపలకు రండి

అంటూ ఆమె నాకు మాట్లాడే అవకాశం యివ్వ కుండా లోపలకు నడిచారు.

నేను వినమ్రంగా అనుసరించాను.

ఆమె ఒక బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళారు.

అక్కడి దృశ్యం చూసి నేను స్థాణువైపోయాను.

పద్దెనిమిది సంవత్సరాలు నిండిన అబ్బాయి మంచం మీద పడుకున్నాడు.

కాళ్ళు చేతులు ఈనుపుల్లల్లా ఉన్నాయి.

అరవై సంవత్సరాల వయస్సున్న వ్యక్తికి ఉండే పేద్ద బానపొట్ట ఉంది.

శరీరం మీద షార్ట్ తప్ప మరేం లేదు. శరీరమంతా చేపపొలుసుల్లా చర్మం పొరలు పొరలుగా ఉంది. వంకర్లు తిరిగిన చేతి వేళ్ళ మధ్య రిమోట్ ఉంచుకుని యానిమల్ ప్లానెట్, డిస్కవరీ ఛానెల్స్ చూస్తున్నాడు.

ఆమె అతన్ని నాకు పరిచయం చేశారు.

"వాడు మా అబ్బాయి. పుట్టుకతోనే పోలియో వచ్చి కాళ్ళు చేతులు పనిచేయకుండా పోయాయి. ఎన్నో లక్షల రూపాయలు ఖర్చుచేశాం. దాని ఫలితంగా అటూ యిటూ తిరగగలడే గాని లేవలేడు. చేతులతో వ్రాయడం, బొమ్మలు వేయడం లాంటివి చేయగలడు. ఎక్కువసేపు ఒకే భంగిమలో ఉంటే ఆయాసపడు తుంటాడు. మీరు వాడికి ట్యూషన్ చెప్పాలి. వాడికి అయిదో క్లాసు వరకు నేనే అన్నీ పూర్తిచేశాను. ఆరవ తరగతి నుంచి నేను లెక్కలు చెప్పలేకపోతున్నాను. నేను మేథ్స్ స్టూడెంట్‌ని కాదు. ఎం.ఎ. ఫిలాసఫీ చేశాను. మీరు ప్రతీరోజూ సాయంత్రం మీ కాన్వెంటు అయిపోయాక ఓ రెండు గంటలు వాడికి చదువు చెప్పండి. అంటే వాడితో కాలక్షేపం చేయండి. మీరు కోరినంత ఫీజు ఇస్తాను."

ఆ అబ్బాయి "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు

## సంత

ఊరి కో'సంత' అనాడు
కూరగాయలకు / నిత్యావసర వస్తువులకు
బట్టలకు / మట్టిపాత్రలకు...
వారాంతంలో జరిగే సంత / సందడే.. సందడి..
కాలగర్భంలో 'సంత' రూపురేఖలు మారిపోయి..
రైతుబజార్‌లు / సూపర్ మార్కెట్‌లు
రిలయన్స్ ఫ్రెష్ / సుభిక్ష / స్పెన్సర్స్
కొత్త.. కొత్త అవతారాలు...
హంగులు / ఆర్భాటాలు / క్లాస్ దోపిడీ
గ్లోబలీకరణలో / వినియోగదారుడు ఉక్కిరి.. బిక్కిరి
ఒకప్పుడు ఆడపిల్లలు / గుండెలపై కుంపట్లు...
ఇప్పుడు వీధికొక మ్యారేజి 'లైన్స్'
ఇంటర్నెట్‌లో పెళ్ళికొడుకుల వివరాలు...
'సంత'లు పెళ్ళికొడుకులు అమ్మబడును / గ్రేడ్‌ల వారీగా
స్థాయినిబట్టి కట్నం / లాంఛనాలు...
'ఎ' గ్రేడ్‌లు ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్./ఇంజనీర్‌లు/డాక్టర్లు
'బి' గ్రేడ్‌లు... ఆఫీసర్లు... మేనేజర్లు
'సి' గ్రేడ్‌లు... పంతుళ్ళు... గుమస్తాలు
'డి' గ్రేడ్‌లో... అటెండర్లు, ప్యూన్‌లు
విదేశీ 'మోజు' వున్నవారి కోసం...
సరికొత్త 'సరుకు' / మాయల ఫకీర్ల రూపంలో
నిల్చి పెళ్ళికొడుకులు వున్నారు...
ఒక్కో 'గ్రేడ్'కి ఒక్కో ధర...
ధర ఎక్కువ పెట్టిన వాడికే 'స్వంతం'
కొనుక్కునేవి ఎవరయినా 'అధికారం' వాడిదే!
'సంత'లో పశువులా అమ్ముడవుతున్నాననే
సిగ్గు / లజ్జ / మానం - అభిమానం/
ఇవేవీ వాళ్ళకి వుండవు...
చీము / నెత్తురు లేని వెధవలు
రూపాయల మూటలే / వారి బ్రతుకు
ఒకప్పుడు ఆడపిల్లల తండ్రులకు / చెప్పుల'చిల్లు'
నేడు బ్యాంక్ బాలెన్స్ / నిల్లు...
అయినా తప్పవు వారికి / పాట్లు
కట్నాసురుల తీరని ధనదాహంతో
సమిధలుగా / ఆహుతై...
కడుపు 'కోత' / గుండె 'పోటు'
తెప్పిస్తున్న / కసాయిలు
ఈ 'కట్న' దురాచారం / 'అంతం' అయ్యేది ఎప్పుడో!
రాజారామ్మోహన్‌రాయ్‌లాంటి / సంఘ సంస్కర్తలు
ఉద్భవించాలని / నిరీక్షిస్తున్న ఆడపిల్లలు
ఫలించేది ఎప్పుడో / 'సంత' సమసిపోయేది ఎన్నడో
-సి హెచ్. వి. యస్. బ్రహ్మానందరావు

చేతులు జోడించి.

ఆ నమస్కారం పెట్టినందుకే అతని నరాలు ఎంతగా బాధపెట్టాయోగాని అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగి గిర్రున వాడినట్టుగా ఉన్న బుగ్గల పైనుంచి జలజలా రాలిపోయాయి.

"నమస్తే నాన్నా! నీ పేరు?..." అడిగాను.

నా హృదయం జాలితో నిండిపోయింది. హృద యం ఆర్ద్రతతో చమర్చింది. దానికి కారణం అతను అనుక్షణం ఆయాసపడుతూ దీర్ఘ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు.

"ఆదిత్య!" అన్నాడతను. వాళ్ళమ్మగారు యిలా అన్నారు.

"అవును సార్! మా వంశాంకురం వాడు. మాకు సూర్యోదయం ముఖ్యం కాదు. ప్రతీ క్షణం వాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే మా కుటుంబ సభ్యుల తపన. అదే మా జీవితాలకు నిజమైన సూర్యో దయం.

వాడికి చదరంగంలో ప్రవేశం ఉంది. ఎత్తులు బాగా వేస్తాడు. ఇంట్లో కంప్యూటర్‌కు ఇంటర్నెట్ పెట్టిం చాము. మొన్నీమధ్య విశ్వనాథన్ ఆనంద్‌తో ఛాటింగ్ కూడ చేశాడు. డౌట్స్ క్లారిఫై చేసుకున్నాడు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే– తెలుసుకో వాలన్న తపన, నేర్చుకోవాలన్న ఆసక్తి మనిషికి ఉంటే, ఎటువంటి స్థితిలో ఉన్నా తప్పనిసరిగా రాణించే అవకాశం ఉంటుంది. టైంపాస్ కోసం మనిషి టీవీ, కంప్యూటర్ పెట్టుకుని రోజంతా గడిపేయొచ్చు. అది ఏదైనా సాధించామనే మానసిక ఆనందం ఇవ్వదుగదా మమ్మీ!" అంటాడు వాడు.

వాడికి జి.కె. ప్రశ్నలు అయిదు వేలకు పైగా వచ్చు. మా యింట్లో టెలిఫోన్ డైరెక్టరీ ఉండదు. ఎందుకంటే వాడే మాకు రెడీ రెకనార్. సుమారు 500 మంది సెల్‌ఫోన్ నంబర్లు వాడు అవలీలగా చెప్పగలడు. వాడినడిగే మేము ఏ నంబర్‌కైనా ఫోన్ చేస్తాం.

వాడికి ఊహ తెలిసిన నాటినుంచీ మంచం మీదే ఉన్నాడు.

నువ్వు అనవసరంగా శ్రమపడవద్దు నాన్నా అంటే, 'శారీరక శ్రమ ఎలాగూ లేదు. మానసికంగానైనా బ్రెయిన్‌కి ఎక్సర్‌సైజ్ లేకపోతే ఎలా మమ్మీ! ఇంత చవటని కన్నానా అని నువ్వు ఏనాడూ బాధపడ కూడదు' అంటాడు.

కొన్ని విషయాలలో వాడి సలహా మాకు అద్భు తంగా వర్కవుట్ అవుతుంది. వాడి చేత్తో ఏది స్పృశిం చినా ఆ వ్యాపారం పట్టిందల్లా బంగారం అవుతుంది. అందుకే వాళ్ళ నాన్నగారికి వాడంటే పంచ ప్రాణాలు.

వాడిని ఎక్కడకు కావాలన్నా ఎత్తుకుని ఆప్యా యంగా గుండెలకు హత్తుకుని తీసుకు వెళ్తారాయన. వాడి వైద్యం కోసం ఎన్నో కిలోమీటర్లు నడిచారు– తిరుమల కొండెక్కారు. ఎందరో డాక్టర్ల దగ్గరకు తీసు కెళ్ళారు.

ఉత్తరాది యాత్రలన్నీ ఒకసారి, దక్షిణాది యాత్ర లన్నీ ఒకసారి అన్నీ చేయించి అందరు దేవుళ్ళనీ చూపించారు.

"ఎందుకు నాన్నా ఈ పనికిమాలిన కొడుకు కోసం అంత శ్రమపడతావు?" అని అడిగాడాయన్ని ఒకసారి.

## నాగిశెట్టి నానీలు

చిట్టి పొట్ట కోసం
రేపటికి కూడా
ముందు చూపు అంటే
చీమదే

కాడి, మేడి, కర్రు
కక్కుల కత్తి కనపడటంలా
యంత్ర భూతం
మింగేసింది–

నేతన్నను
పైకి లాగుదాం రండి
మగ్గం గుంట
లోతు పెరిగిపోయింది

బండరాయి
స్వాభిమానం కొండయ్యింది
సైనికుని
పాదధూళి తగిలిందా

తండ్రి చేతికి
ఎముకే లేదు
కొడుకు నోటికి విరామం లేదు
అడుక్కొంటూ...

వృద్ధ భిక్షువు / భృకుటి ముడి వెక్కిరిస్తోంది
నా తరువాత
నీవేగా అని–

–నాగిశెట్టి

"ఓ పనికిమాలిన తండ్రి కడుపున పుట్టానేమిటా అని నువు బాధపడకూడదు నాన్నా! శారీరక శ్రమ మనసుకు, శరీరానికి కూడా శాంతినిస్తుందని టీవీలో ఎవరో స్వామీజీ సందేశం విని నువ్వేగా చెప్పావు. ఇలా చేస్తే నాకు ఆనందంగా ఉంటుంది నాన్నా. నీకు బాధగా ఉందా?" అని అడిగారాయన.

"ఎన్ని జన్మలయినా మీరే నాకు తండ్రిగా కావాలి నాన్నా" అంటూ కరుచుకుపోయాడు వాడు.

"నాకు మళ్ళీ జన్మలో నీ కొడుకుగా పుట్టాలని ఉంది నాన్నా!" అని ఆయన యిలా ఒకరికొకరు ప్రాణస్నేహితులు వాళ్ళిద్దరూ.

ఆయన యింట్లో ఉంటే వాడితోనే గడిపే ప్రయత్నం చేస్తారు.

వాడు కోరిందల్లా తెస్తారు, యిస్తారు.

ప్రజ్ఞకు మేథ్స్ బాగా అర్థం కావడంతో ఇంటికి వచ్చి మీ గురించి చెప్పింది. అప్పటినుంచి ప్రతీరోజూ మీ గురించి అడిగి తెలుసుకోవడం మొదలుపెట్టాడు వాడు. "ఈ వేళ సార్ ఏం చెప్పారు?" అని ప్రతీరోజూ అడుగుతుంటాడు. ప్రజ్ఞ వాడికి అన్నీ వివరంగా చెబుతుంది.

చక్కని విషయం ఒకరి ద్వారా ఒకరికి వ్యాప్తి చెందడానికి మనిషికన్నా గొప్ప సాధనం మరోటి లేదేమో.

వాడికి చదువుకోవాలని ఉంది. ఈ మధ్య టీవీలో కాళ్ళులేని వాళ్ళు కేవలం చేతులతోనే అన్ని పనులూ చేస్తూ చదువుకోవడం; ఒక కాలు లేకపోయినా మరో కాలుతో చిరంజీవిలా స్టెప్స్ వేయడం, సుధాచంద్రన్ లాంటి మహోన్నత వ్యక్తి తన లక్ష్య సాధన కోసం జైపూర్ పాదం కనుగొనేలా చేసి ఈ వేళ ఎన్నో కోట్ల మంది అంగవికలురకు ప్రపంచాన్ని చూడగలిగేలా చేయడం, తద్వారా ఎన్నో వేల మందికి ఉపాధి దొరకడం... యివన్నీ గమనించాక, 'నేను సార్ దగ్గర చదువుకుంటానమ్మా. నాకు ట్యూషన్ ఏర్పాటు చెయ్యవా' అని అడిగాడు.

శారీరకంగా రెస్ట్‌గా ఉన్నా మానసికంగా అరక్షణం విశ్రాంతిగా ఉండనివాడు మళ్ళీ యీ చదువు పేరుతో యింకా స్ట్రెయిన్ అవుతాడని వాళ్ళ నాన్న భయం. కాని వాడికి మీ దగ్గర చదువుకోవాలని ఉంది.

మీరు ట్యూషన్ యింటికి వచ్చి చెబుతున్నారని మీ ప్రిన్సిపల్‌కి చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే వాడు మీరు పనిచేసే కాన్వెంట్లో చదవడంలేదు కనుక.

ఒకవేళ మిమ్మల్ని ఏమైనా అంటే, మీ ప్రిన్సిపాల్‌ను ఎలా ట్రీట్ చెయ్యాలో ఆయనకు బాగా తెలుసు. అందుకే విషయం పూర్తిగా తెలియక మీరు ఆయనతో చెప్పేవస్తారేమో అని కంగారు పడ్డాను. ఎనీహౌ థాంక్స్ ఫర్ కమింగ్.

నా వాగుడుతో మిమ్మల్ని బోర్ కొట్టించినట్టున్నాను.

## ఒకే దండ పూసలం

మీ కులం మా కులం / కలిసున్న మన కులం
విడిపోయిన కలకలం
మీ మతం మా మతం
కలిసున్న మన మతం
అందరికి సమ్మతం
కలవనిచో రెటమతం
మీ భాష మా భాష
భావాలెన్నో కలిసిన భాష
ప్రేమించె మాతృభాష
విడిపోయిన సవితి భాష
మీ గ్రామం మా గ్రామం
కలిసున్న మన గ్రామం
ద్వేషాలకు బహుదూరం
కలవనిచో సంగ్రామం
మీ జిల్లా మా జిల్లా
కలిసున్న మన జిల్లా
కలిమి చెలిమి కోకొల్ల
వేరైన స్వార్థం నిలువెల్ల
మీ ప్రాంతం మా ప్రాంతం
కలిసున్న మన ప్రాంతం
సిరులెన్నో సంప్రాప్తం
విడిపోయిన చెడు ప్రాప్తం
మీ రాష్ట్రం మా రాష్ట్రం
కలిసున్న భారత రాష్ట్రం
ఏకత్వానికి పరాకాష్టం
విడిపోయిన రావణకాష్టం
మనదంత ఒకే గళం
మనం భారతీయులం
విడివిడిగ కనిపించే
ఒకే దండ పూసలం

—అడిగొప్పుల సీతారామయ్య

## ఒక్కడు చాలు!

పిడుగులు పైబడినా
అడుగులు తడబడనీయకు
కత్తులు / కుత్తుకలను కత్తిరించినా...
దేహాన్ని ఖండ ఖండాలుగా చీలుస్తున్నా...
పదుగురి క్షేమం పల్లవించాలి
మానవతా రాగం ఆలపించాలి.
ఉగ్రవాదం / ఉచ్చులు పన్ని
పంజా విసిరినా...
కుహనా తంత్రాలు / కత్తులు నూరినా...
జడిసి పోరాదు / వెన్ను చూపరాదు.
సమకాలీన సమాజ చిత్రపటాన్ని
ఛిద్రం చేస్తోన్నా...
వాదాల పిడిబాకులకు / రొమ్ము విరిచి నిలవాలి
దమ్ము చూపి నిలువరించాలి.
నింగి నిలువునా కూలినా...
పుడమి రెండుగా చీలినా...
ముక్త కంఠంతో నినదించాలి
మళ్ళీ లేచి నిలబడాలి.
నిష్ఠుర జీవిత వెతలకు / నిస్తేజ జీవన గాథలకు
ఆశల ఊపిరి కావాలి / వెన్ను దన్నుగా నిలవాలి
ఎందరో... ఎందరెందరో...
ఉగ్రవాద అగ్నికీలల్లో / ఆహుతి అవుతున్న
అమాయక సమిధలు!
అంధకార బంధుర / భీతావహ బతుకుల
ప్రాణాలను బలిగొంటున్న
తీవ్రవాద జ్వాలా కాష్ఠ సమాజంలో
మనిషికి మనిషే / ఆసరా కావాలి!
మానవీయ విలువల్ని / మళ్ళీ విత్తుకోవాలి
మానవతా వృక్షాన్ని
చిగురింప జేయాలి.
శాంతి సుమాలను పుష్పించాలి!
ఒకే / ఒక్కడు చాలు!
సమస్త మానవ శ్రేయ శంఖారావాల్ని పూరించ
డానికి!
కొడిగడుతున్న
సమ సమాజ కళ్యాణ జ్యోతిని వెలిగించడానికి!
ఒక్కడు చాలు!

-వంగర పరమేశ్వరరావు

ఇప్పుడు మీ అభిప్రాయం చెప్పండి" అన్నారావిడ.

"మీరు చెప్పింది ఆదిత్య పరిస్థితి గురించి. అది నాకు బోర్ ఎలా అవుతుంది? పైగా ఒక విద్యార్థికి చదువు చెప్పాలంటే అతని బ్యాక్‌డ్రాప్ ఎంత తెలిస్తే అంత మంచిది. నేను డైలీ వచ్చి చెబుతాను" అని నా అంగీకారం తెలియజేశాను.

ఆ రోజే నేను ప్రజ్ఞతో పాటు ఆదిత్యకూ ట్యూటర్‌గా జాయినయ్యాను.

❖ ❖ ❖

నా దగ్గర రేర్ కలక్షన్స్ చాలా ఉన్నాయి. ముఖ్యంగా బ్యూటిఫుల్ లైబ్రరీ ఉంది. నేను చిన్నప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఎంతో కష్టపడి దాచుకున్న పాకెట్ మనీ ఆ వయసులో నేను యిష్టపడిన కామిక్ బుక్స్, ముళ్ళపూడి బాలసాహిత్యం, మల్లిక్ 'చిట్టి' కార్టూన్స్, బాలభారతం, రామాయణం, భాగవతం, స్వామి వివేకానంద బోధనలు నుంచి హేరీపోటర్ బుక్స్ వరకు... ఒక్కొక్కటిగా ఆదిత్యకు పరిచయం చేయ సాగాను.

దానికీ కారణం ఉంది.

నేను ట్యూషన్ ప్రారంభం చేసిన రెండవ రోజు–

ఆదిత్య నాకు ఒక నోట్సు అందించాడు.

"ఏమిటిది?" తెరవకుండానే అడిగాను.

"నిన్న మీ నుంచి నేర్చుకున్న మంచి విషయాలు."

వాటిని పరిశీలించాను.

నేను చెప్పిన మొదటి వాక్యమే అక్కడ ఒక ముఖ్యమైన విషయంగా వ్రాశాడు.

"విద్యార్థిదశలో ప్రతీ విద్యార్థికి ముందుగా 'చదువు' ప్రధానం. తరువాత హాబీస్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. హాబీస్‌కు ప్రాధాన్యం ఇచ్చి చదువులో మనిషి వెనుక బడితే అతను పైకి వచ్చే అవకాశాలు తక్కువ. చదువులో ఫస్ట్‌గా ఉంటూ దానికి తనకిష్టమైన హాబీలో ప్రావీణ్యం పెంచుకుని జతచేస్తే– అతను అద్భుతంగా రాణిస్తాడు. కనీసం ఆరోజు తాను కొత్తగా ఏం నేర్చుకున్నాడో ఒక పుస్తకం వ్రాసుకుంటే మంచిది. వాటిలో అన్నీ పాటించలేకపోవచ్చు. పాటించ గలిగినన్ని అనుసరిస్తే అతను ఉత్తమ వ్యక్తి తప్పక అవుతాడు."

నేను ఆశ్చర్యపోయాను.

ఆదిత్య ఏకసంధాగ్రాహి.

ఒక్కసారి చెబితే చాలు, అక్షరం పొల్లుపోకుండా తిరిగి చెప్పేస్తాడు. నేను చెప్పే మాటలు అతన్ని ఎంతగా

ప్రభావితం చేశాయో ఆ పుస్తకం చూస్తేనే నాకు అర్థమైపోయింది.

వారితో అలా మొదలైన నా పరిచయం వారికి నన్ను ప్రాణమిత్రుని గాను, వారు నాకు ఆత్మీయులు గాను మిగిలిపోయేలా చేసింది.

ప్రజ్ఞకు టెన్త్ పూర్తయింది.

569 మార్కులతో స్టేట్ సెకండ్ రాంక్ సాధించింది. కార్పొరేట్ కాలేజీలో చేర్పించారామెను.

అయినా నేను ఆదిత్యకు ట్యూషన్ మానలేదు.

అతనికి సెవెన్త్ సిలబస్ కంప్లీట్ చేసేశాను.

ఇప్పుడు ఆదిత్య ఎన్నో కంప్యూటర్ మేథ్స్, పజిల్స్‌ను సాధించే 'జెమ్'.

"రేపట్నుంచి వారం రోజులు సెలవు కావాలి సార్!" అన్నాడు ఆదిత్య.

"ఏం?" అన్నాను.

"రేపు రాత్రికి పెద్ద తిరుపతి వెళ్తున్నాం సార్!"

"స్వామి ప్రవేశ ద్వారం వద్ద ఉండే హుండీలో నా పేరు చెప్పి ఈ 116 రూపాయలు వేసిపెట్టు" అన్నాను డబ్బు పొట్లం కట్టి యిస్తూ.

"మీరివ్వద్దు సార్! నేను వేస్తాను" అన్నాడు.

"గురువు పట్ల నీకున్న అభిమానం నాకు తెలుసు. కానీ ఫలితం నాకు దక్కాలంటే స్వామికి నా కష్టార్జితమే సమర్పించుకోవాలి" అన్నాను.

ఆదిత్య తీసుకున్నాడు- యింకేమీ మాట్లాడకుండా!

వాళ్ళు లేని వారం రోజులూ పిచ్చెక్కినట్టయింది నాకు.

అంతగా వారి కుటుంబానికి ఆత్మీయుడైపోయాను మరి.

అయితే ప్రతీ రాత్రి తాము ఏఏ ప్రదేశాలు తిరిగిందీ స్పష్టంగా ఫోన్‌లో మాట్లాడేవాడు ఆదిత్య.

వాళ్ళు యాత్ర నుంచి తిరిగి వచ్చేశారు అని తెలియగానే ఆ సాయంత్రమే వారింటికి నా టైమ్ షెడ్యూల్ ప్రకారం వెళ్ళాను.

స్వామి ప్రసాదం యిచ్చారు. ఆస్వాదించాను.

"సార్ మీకు యీ చిన్న బహుమతి!" అంటూ ఓ పేకెట్ యిచ్చాడు ఆదిత్య.

విప్పి చూశాను.

ఆంజనేయుని ఆత్మీయతతో కృతజ్ఞతాపూర్వకంగా కౌగిలించుకుంటున్న శ్రీరాముని పాలరాతి విగ్రహం అది.

అప్రతిభుడినైపోయాను. అంత సజీవంగా ఉందా

# చినుకులు

సరళత్వానికి ప్రతీక, సాహిత్యానికి పతాక ఈ చినుకులు, భావ విజృంభణే నేపథ్యం, ఛందో బంధనాలు నిషిద్ధం-

## నగరం

నగరం మేరుపర్వతం
బంగారం దొరుకుతుంది కానీ,
గుక్కెడు ఆప్యాయత కరువు/చెంబెడు నీళ్ళు బరువు

## ప్రచారం

నీకెన్ని లోపాలున్నా! / నీవు నవమన్మథుడివి
నీవొప్పుకోపోయినా సరే
నీవు ఇంద్రుడివి, చంద్రుడివి.

## విధి

నీకు తెల్సింది / దానికి తెల్సింది
నీ బతుకు దారి / మలిచే వయ్యారి

## కర్మ

నీ కృషిలో లోపాన్ని / కప్పిపుచ్చే టానిక్
నీకు విషాదంలో / స్ఫూర్తినిచ్చే మ్యాజిక్

## రచన

రచనకు నిర్వచనం / తెలిసింది రాయడం
రాసింది తెలియడం

## చదువు

నీవంటే ఏమిటో తెల్పేది
నీ బతుక్కొక దారి చూపేది
సభ్యత సంస్కారం పెంచేది
సమతావాదం ప్రవచించేది

## బిడ్డలు

మమకారానికి గుర్తులు / మారిపోతే మరకలు
జారిపోతే ఎదలో చురకలు
మమత పంచితే మధురిమల సరిగమలు

## తేడా

మూర్ఖుడు పదే పదే అంటాడు
మొండివాడు అవునంటాడు
అసమర్థుడు పనిగట్టుక వింటాడు
అయోగ్యుడు పదపదమంటాడు

-డా॥ బి.దామోదరరావు

శిల్పం.

ఆదిత్య అన్నాడు-

"ఎంతో దూరంలో ఉన్న లంకకు వెళ్ళి సీతాదేవిని మొదటిసారి కనుగొని, ఆమె సందేశాన్ని శ్రీరామునికి అందించడమే కాకుండా, శ్రీరామ పట్టాభిషేకం వరకూ తన పాత్రను అద్భుతంగా పోషించి భక్తాగ్రేసరుడిగా నిలిచిపోయిన హనుమంతునికి 'యింతకన్నా నీకేమి ఇవ్వగలను?' అంటూ శ్రీరాముడు ఆత్మీయతతో కూడిన కౌగిలిని బహుమతిగా యిచ్చిన సందర్భం నాకు ఎంతో యిష్టం. భగవంతుడు భక్తునికి

## 'ఈ' వేమన నానీలు

**పి**ల్లిలా కళ్ళు మూసుకొని
పాలు త్రాగకు
పులిలా 'అవినీతి'పై
గర్జించు
నానీ అంటే / మెరుపు తీగ
అది సాహిత్య సమాజపు / వెలుగు రేఖ!
ఎగిరే పావురం చూసి
మసాలా నూరే కంటే
శాంతి చిహ్నం అని
గుర్తించు
నీతిని చెప్పాల్సి వస్తుందని / భయంతో
న్యాయదేవత / గంతలు కట్టుకుంది
అమృతపు పలుకులు
పలుకకపోయినా పర్వాలేదు
విషాన్ని చిందించకు
చెమటతో సంపాదించిన నోటే
నీతిగా మారి నీ
ఖ్యాతిని పెంచుతుంది
మురికిని పోగొట్టేది / డిటర్జెంట్
ఆ నీళ్ళను త్రాగి / నీడనిచ్చేదే చెట్టు
చావును జయించాలని
ఆలోచించకు
చచ్చాక బ్రతికే
మార్గాన్ని ఆలోచించు
గాయం తగిలితే / 'అమ్మా' అంటావ్!
ఆస్తి పంపకంలో / ముసలితనంలో
ఆదమరుస్తావ్!

-ఈ వేమన

ప్రసాదించే వరం అంతకన్నా అపురూపమైనది మరొకటి ఉండబోదు" అన్నారు మీరు. అది జ్ఞాపకం పెట్టుకుని మీ కోసం యిది తెచ్చాను."

అతని పట్ల శ్రీరాముడిగానే ఫీలయ్యాను.

అతని నుదుట ముద్దుపెట్టుకుని "యిది నా బహుమతి!" అన్నాను.

ఆదిత్య థాంక్స్ చెప్పలేదు. ఆత్మీయతకు నాలుక మీద నుంచి వచ్చే థాంక్స్ లాంటి కృతకమైన పదాలు నాకు నచ్చవు అని ఆదిత్యకు తెలుసు.

దీపావళి పండుగకు నన్ను భోజనానికి పిలిచారు. నేను సింగిల్‌గా వారి ఆహ్వానం మేరకు ఆ రాత్రి వారి కుటుంబంతో దీపావళి జరుపుకున్నారు.

❖ ❖ ❖

వారం రోజుల తర్వాత హఠాత్తుగా ఫోన్!

కాన్వెంట్‌లో లెసన్ చెబుతుండగా వచ్చిందది.

గబగబా సెలవు పెట్టి పరిగెత్తాను. అపుడే వార్త తెలిసినట్టుంది.

ఆదిత్య యింటికి చేరేసరికి ప్రజ్ఞ ఎదురైంది.

"సార్! అన్నయ్య..." అంటూ బావురుమంది.

నేను స్ఫటిక విగ్రహంలా నిలబడిపోయాను.

నేను హాల్లోకి నడిచాను.

"మాష్టారూ! మీ శిష్యుడు..." అంటూ ఆదిత్య అమ్మగారు వణుకుతున్న కంఠంతో మాటలు రాక ఆగిపోయారు.

నాకు యింకా నమ్మకం కలుగలేదు.

"రాత్రి పది గంటలకు విపరీతంగా ఆయాస పడ్డాడు మాష్టారు! ఆయాసం వచ్చినపుడు జనరల్‌గా ఇంజక్షన్ చేయిస్తారు. పది నిముషాల్లో రిలీఫ్ అవుతాడు.

కానీ ఇంజక్షన్ యివ్వబోతుంటే "మమ్మీ! సార్ హోమ్‌వర్క్ కొంచెం మిగిలిపోయింది. అది చేశాక చేయించుకుంటా! లేకపోతే సార్‌కి కోపం వస్తుంది" అన్నాడు.

"సార్‌తోనే చెబుతాలే నాన్నా!" అని మాట యిచ్చాక చేయించుకున్నాడు.

"అదే వాడి ఆఖరి మాట!" అన్నారు ఆదిత్య తండ్రి గాద్గదిగ స్వరంతో.

అంతే ఒక్కసారిగా బరస్ట్ అయిపోయాను.

ఎంతసేపు అలా ఏడుస్తూ ఉండిపోయానో నాకు తెలియలేదు-

నా కళ్ళ నీళ్ళు తిరుగుతూనే ఉన్నాయి-

బుగ్గల వెంట జారుతూనే ఉన్నాయి.

దృశ్యం మసక అయినపుడల్లా కళ్ళు తుడుచు కుంటూనే ఉన్నాను.

మళ్ళీ మామూలే.

క్షణాల్లో ఎందరెందరో వచ్చారు. "ఎవరాయన, అంతగా బాధపడుతున్నారు?" ఎందరో అడిగారు. ఎందరితోనో అన్నారా దంపతులు.

"ఆయన వాడి మాష్టారు! చివరగా ఆయన్ని గుర్తుచేసుకుని మరీ... చదువు అంటే వాడు అంత యిష్టపడేలా చేసింది ఆయనే!"

"దీపాలు పెట్టే వేళకే తీసుకుపోవాలి" అన్నారు ఎవరో.

కార్యక్రమాలు మొదలయ్యాయి.

అందరూ దండలు వేశారు. నన్నూ ఒక్కటి వెయ్యమన్నారు.

దండ వేశానో లేదో గుర్తులేదు. నా కన్నీళ్ళు మాత్రం 'ఆదిత్య'ని అభిషేకించాయి.

"నాకీ అదృష్టం చాలు మాష్టారూ!" అన్నట్టు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు ఆదిత్య.

అన్నీ పూర్తయ్యాక ఆదిత్యను తాటాకు చాపలో మూటకట్టేశారు.

నేను చూస్తూ ఉండగానే, నా కన్నీరు యింక కుండానే...

ఆదిత్య వెళ్ళిపోయాడు. కాదు... తీసుకు పోయారు.

ఇంక ఆ యింటికి ఏమని రాగలను? ఎందుకు రాగలను?

"మాష్టారూ! ఇది మాత్రం మీకు యిమ్మని వాడి కోరిక. ఎందుకంటే మీరు దీన్ని పది మంది విద్యార్థులకు చూపి 'మార్గదర్శి' అవుతారని– వారికి తాను 'మార్గదర్శి'గా మిగిలిపోవాలని!" అంటూ ఓ పుస్తకం నా చేతిలో పెట్టి లోపలకు వెళ్ళిపోయారు ఆదిత్య అమ్మగారు.

"ఈ రోజు నేను నేర్చుకున్న విషయాలు" అన్నదే ఆ పుస్తకం.

కాలం నది ఆయుష్షు తీరిన నావలా అతన్ని తీసుకుపోవచ్చు.

కాని 'చుక్కాని' నా చేతిలో ఉంది అన్న సంతృప్తితో ఆదిత్యకు అంజలి ఘటిస్తూ యింటిదారి పట్టాను.

■

## మనిషిగతి

మనిషి కొలిచె దూరాన్ని
మనసు కొలిచె వేగాన్ని
మనసు లోతు కొలువలేమురా!
మనసు నాపె మనిషి లేడురా!

ఆడ మగ ఒక జంట
తోడు నీడ ఒక బంధం
బంధం ఒక అనుబంధం
మమత పంచు అనురాగం
సమత నిండు సంసారం
సౌఖ్యమైన ఒక స్వర్గం
మనుగడకది పరమార్థం!
మానవతకు అది మోక్షం! ॥మనిషి॥

ఎదుగుతున్న మనిషి నేడు
యంత్రమైపోతుంటే...
సంపదల దారి పట్టి
స్త్రీ, పురుషులు పోటీపడి
ఎండమావి నీళ్ళకై
పరుగో... పరుగురా!
బతుకు బండ్లురా! ॥మనిషి॥

కన్న కడుపు చిరునవ్వులు
బేబికేరు అరుపులయ్యే
చిలక పలుకు పిల్లలకే
గాడిద మోత బరువులయ్యే
అక్షరాల రాపిడిలో
కమిలి వాడిపోతుంటే
ఎవరికి వారే యమునతీరు
ప్రతి ఇంట్లో బతుకులు నేడు! ॥మనిషి॥

కలలు కన్న కడుపులు మాడి
బతుకులన్ని వలసలయ్యే
వయసు మళ్ళిన పెద్దలంత
ఆశ్రమాల్లో బొమ్మలైరి
అధిక వడ్డీ ఆశలన్నీ
నిలువెల్లా ముంచివేస్తే
దగాపడ్డ బతుకులన్నీ
ఏకాకిగా కుమిలి ఏడ్చే! ॥మనిషి॥

–ఆకుల రాఘవ